క్లుప్తంగా

పరిశుభ్రతకు ప్రాధాన్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపవరం : గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దగోపవరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ద్వారా వివిధ వేషధారణల్లో పరిశుభ్రత, ఆరోగ్యభద్రత తదితర అంశాలపై నాటక ప్రదర్శన నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కలిగే ప్రయోజనాలు, సంపూర్ణ ఆరోగ్యం తదితర అంశాలపై నిర్వహించిన చిన్నారుల నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అనంతరం నాటక ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుపాల్‌రెడ్డి, ఏఎస్‌ఎం సుజాత, సచివాలయ సిబ్బంది ప్రవీణ్, కొండారెడ్డి, మహేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె



కూలిన మట్టి మిద్దె పైకప్పు

మైదుకూరు : మైదుకూరులో మంగళవారం రాత్రి భారీ వర్షానికి రమణమ్మ అనే వృద్ధురాలికి చెందిన మట్టి మిద్దె పైకప్పు కూలిపోయింది. అయితే ఆమె బయట పడుకుని ఉండటంతో ప్రమాదం తప్పింది. బుధవారం మున్సిపల్ ఏఈ విశ్వ కిరీటి బాధితురాలిని పరామర్శించి, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా మండల పూజ



హోమం చేస్తున్న వేద పండితులు, భక్తులు

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం మండల పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారల మధ్య పూజలు, హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆరెద్దుల సంజీవరాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులు కాయా కర్పూరం సమర్పించి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మైదుకూరులో ర్యాలీ

మైదుకూరు : తిరుమల ఆలయంలో భక్తులకు పంపిణీ చేసే లడ్డూలో జరిగిన కల్తీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మైదుకూరులో బుధవారం సాయంత్రం హిందూ ఆలయాల పరిరక్షణ సమితి పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నివాళి



చంద్రశేఖర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శాప్ మాజీ డైరెక్టర్ కొండు చంద్రశేఖర్‌రెడ్డి (52) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ బుధవారం చంద్రశేఖర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, అట్లూరు మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మాధవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు పుత్తాశ్రీరాములు, కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, శివయ్య, బిజ్జం రమణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

చిత్తూరు ఐసీడీఎస్ పీడీగా హైమావతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని ప్రొద్దుటూరు సీడీపీఓగా పనిచేస్తున్న కె.హైమావతిని చిత్తూరు ఐసీడీఎస్ పీడీగా బదిలీ చేస్తూ ఐసీడీఎస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కుప్పం అడిషనల్ పీడీగా నియమించి పీడీగా పూర్తి బాధ్యతలను అప్పగించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మైదుకూరు : ఉల్లిపంటను పరిశీలిస్తున్న అధికారులు



కలసపాడు : వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు: వరి పంటలో నూతన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి మ్యాగి అన్నారు. మండలంలోని అల్లాడుపల్లె, కేతవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటికే 12వేల ఎకరాలలో రైతులు వరి సాగు చేశారన్నారు. వరి నాట్లు వేసే సందర్భంగా కాలిబాటలు తప్పక తీయించుకోవాలని సూచించారు. దీని వలన మంచి గాలి, వెలుతురు అంది పైరు వేపుగా పెరుగుతుందన్నారు. యూరియాను అవసరం మేరకూ వినియోగించుకోవాలన్నారు. వరి చీడ పీడలు సోకినప్పుడు వ్యవసాయ సిబ్బంది సంప్రదించాలని తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు. రైతుల అవసరం మేరకు కడప ఏరువాక శాస్త్రవేత్తలను పంట పొలాల పరిశీలనకు తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, స్థానిక నాయకులు నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు: రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంభించి అధిక దిగుబడులు సాధించాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులు మారుతున్న వాతవరణానికి అనుకూలంగా ఆధునిక పద్ధతులు పాటించాలని తద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులుయ సాధించవచ్చని పేర్కొన్నారు. ఉద్యానశాఖ అధికారి భరత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో చీనీతోటలు అధికంగా ఉన్నాయని చీనీ చెట్లు చిగురుతొడిగి పూత వచ్చేసమయం ఇదేనని పిందె కట్టు, పల్లాకు తెగులు, బోరాన్‌లోపం, మెగ్నిషియం లోపాల నివారణపై రైతులకు వివరించారు. అనంతరం పొలం బడి పిలుస్తోంది కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, రైతుసేవాకేంద్రం సహాయకుడు రామమోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

మైదుకూరు : పంటల సాగులో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ మైదుకూరు ఏడీ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లె, కేశలింగాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పంటలకు అవసరమైన మేరకే ఎరువులను వాడాలని సూచించారు. కడప కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వీరయ్య మాట్లడుతూ మినుములో రకాలు, పంటల సాగు గురించి వివరించారు. పసుపులో దుంప కుళ్లు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, అరటిలో సిగటోక ఆకు మచ్చ తెగులు నివారణ గురించి రైతులకు వివరించారు. వనిపెంట కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ పసుపు, అరటి, ఉల్లి తదితర ఉద్యాన పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై సమగ్రంగా తెలిపారు. అనంతరం అధికారులు పలు రకాల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మైదుకూరు మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, ఉద్యాన అధికారి రామకృష్ణ, బేబీ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లె, మహానందిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ అవగాహన కల్పించారు. వరి, మినుము పంట యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇచ్చారు. వరిపంటలో సుడిదోమ యాజమాన్య పద్ధతులు, పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో వీపీఏలు మునికుమారి, అశోక్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించండి

దువ్వూరు : మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులను సాంకేతికతను వినియోగించుకుని రైతులు అధిక దిగుబడులను సాధించాలని మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడంతో రైతులకు మేలు కలుగుతుందన్నారు. రైతులకు ఆదాయం పెంచేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చరల్ అసిస్టెంట్ యువతేజ, రైతులు పాల్గొన్నారు.



చాపాడు: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మ్యాగి



అట్లూరు: పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు



దువ్వూరు : రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ అమరనాథరెడ్డి

భారీ వర్షం.. పొంగిన వాగులు, వంకలు

చాపాడు: మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షానికి పలు చోట్ల ఉన్న వంకలు, వాగులు వరద నీటితో ఉప్పొంగాయి. దీంతో మండలంలోని పలు చోట్ల వరి పంట నీట మునిగింది. మండల వ్యాప్తంగా 44.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది. మండలంలోని చాపాడు, సోమాపురం, బద్రిపల్లె, గుంతచీపాడు, రాజువారిపేట, అనంతపురం గ్రామాల వద్ద వంకలు పొంగిపొర్లాయి. 100 ఎకరాలలో వరి పంట నీటి మునిగినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు.

దువ్వూరులో భారీ వర్షం

దువ్వూరు : మండలంలో మంగళవారం రాత్రి గుడిపాడు, చిన్నశింగనపల్లె, భీమునిపాడు, నీలాపురం, దాసరిపల్లె, కానగూడూరు, చింతకుంట తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో 78.8 మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదైనట్లు మండల గణాంక అధికారి ప్రమీల తెలిపారు. ఈ మధ్య కాలంలో ఖరీఫ్ సీజన్‌లో అతి పెద్ద వర్షం కురవడం ఇదే మొదటిసారి. ఈ వర్షంతో కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నీలాపురం గ్రామం వద్ద ఉన్న వాగు ఉప్పొంగి సుగాలి తండాకు రాకపోకలు స్తంభించాయి. గత ప్రభుత్వంలో సుగాలి తండాకు రూ.65 లక్షలతో కల్వర్టు, రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు పంపించగా ఎన్నికలు రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. వాగుపై కల్వర్టు నిర్మించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని తండా ప్రజలు కోరుతున్నారు.



వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

అచ్చిరాని అట్లూరు తహసీల్దార్ పదవి

అట్లూరు: అట్లూరు మండలానికి తహసీల్దారుగా విధులు నిర్వర్తించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక్కడ పనిచేసిన తహసీల్దారు వేణుగోపాల్ ఎన్నికల అనంతరం తమ సొంత జిల్లా తిరుపతికి బదిలీపై వెళ్లారు. అయితే సాధారణ బదిలీల్లో భాగంగా అట్లూరు తహసీల్దారుగా సువర్ణాదేవిని నియమించారు. కానీ అట్లూరు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టేందుకు ఆమె విముఖత వ్యక్తం చేశారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దారు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పి.సుబ్బలక్షుమ్మను అట్లూరు తహసీల్దారు బాధ్యతలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈమె బాధ్యతలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాల్సిందే.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఘనంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉప దేవతా, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మహిహ అనే విద్యార్థినిని చితకబాది ఆసుపత్రిపాలు చేసిన ఉపాధ్యాయురాలు వసంతరాణిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా విద్యార్థినీ కడప రిమ్స్‌తో చికిత్స పొందుతుంటే విద్యాశాఖాధికారులు పరామర్శించకపోవడం దారుణమన్నారు.

మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యకు సన్మానం

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యను జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. పుల్లయ్యను ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మెంబర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నివాసంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణయ్య యాదవ్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వడ్ల శ్రీనివాస ఆచార్య, గౌరవాధ్యక్షుడు ఆర్.ప్రభుకుమార్, జిల్లా కార్యదర్శులు బాల పెద్దయ్య, కాలే దేవానంద్ పాల్గొన్నారు.



బచ్చల పుల్లయ్యను సన్మానిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సన్మానం

పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ రోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ రాష్ట్ర కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన వంగల శశిభూషణ్‌రెడ్డికి నాయకులు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీవీ జయలక్ష్మి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు వంకధార నరేంద్రరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరరావు, మహిళా మోర్చా నాయకురాలు కుమారి, ముత్యాల శ్రీశ్రీ, గంగాధర్, చెన్నా మోహన్ పాల్గొన్నారు.

బ్ర.మఠంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు

బ్రహ్మంగారిమఠం: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం దక్షిణ ద్వారం తూర్పుభాగంలో మఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజి ప్రాకారం (గోడ) నిర్మాణం చేపట్టారు. నిర్మాణం కోసం అడ్డుగా ఉన్న రెండు సత్రాలను తొలగించారు. అయితే ప్రకారం పూర్తి అయ్యే వరకు తాత్కాలికంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారస్తులకు దేవస్థానం అధికారులు సూచించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా బ్రహ్మయ్య గది నిర్మించుకుని వ్యాపారం చేస్తున్నారు.

అభివృద్ధికి సహకరించండి

అందరి సహకారంతో బ్రహ్మంగారిమఠంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని మఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజి తెలిపారు. ఇందులో భాగంగానే గుడి చుట్టూ ప్రాకారం నిర్మిస్తున్నామని. దక్షిణ ముఖద్వారం తూర్పు భాగంలో ఉన్న సత్రాలు తొలగించామని పేర్కొన్నారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా రేకులతో షెడ్ నిర్మించుకొని వ్యాపారం చేసుకోవాలని సూచించామని చెప్పారు. అనుమతి లేకుండా నిర్మించిన రూమ్‌ను తొలగిస్తామని పేర్కొన్నారు. మఠం అభివృద్ధికి సహకరించాలని కోరారు.



అనుమతి లేకుండా నిర్మించిన దుకాణం

వైఎస్సార్‌సీపీ వెన్నంటే బీసీలు



ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్నంటే బీసీలు ఉన్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పార్టీని వీడటం బాధాకరమన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేసిన వ్యక్తి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కృష్ణయ్య రాజ్య సభలో బీసీల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం గొంతు వినిపిస్తాడనే ఉద్దేశంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిని చేశారని తెలిపారు. ఆయన రాజ్యసభ సభ్యత్వాన్ని, పార్టీని వీడటం విచార కరమన్నారు. బీసీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని తెలిపారు. అక్టోబర్ నుంచి తాను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి బీసీల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

బద్వేలు అర్బన్ : నిత్యం పనిఒత్తిడిలో విధులు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరఫున బుధవారం స్థానిక సుమిత్రానగర్‌లోని షాలోమ్ అనాథశరణాలయంలో పిల్లలకు యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో విద్యుత్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సామాజిక సేవ కార్యక్రమాల వలన ఎంతో మంది నిరాశ్రయులకు అనాథ పిల్లలకు చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంఘం సభ్యులకు సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు బి.నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎం.వి.చలపతి, మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భరణికృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిచంద్రశేఖర్ పాల్గొన్నారు.



పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం నాయకులు

పాఠశాల ఆయాపై కక్ష సాధింపు

చాపాడు: మండల పరిధిలోని గుంతచీపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పారిశుద్ధ్య ఆయాగా పనిచేస్తున్న గొగ్గి రుక్మిణిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగారు. రుక్మిణీ గత కొన్నేళ్లుగా పాఠశాలలో ఆయాగా పని చేస్తూ పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లను పరిశుభ్రం చేస్తూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న వేతనంతో జీవనం సాగిస్తోంది. ఇటీవల టీడీపీ నాయకులు ఒత్తిడి కారణంగా పాఠశాల ఉపాధ్యాయులు తనను తొలగిపోతాలని ఒత్తిడి చేస్తున్నట్లు బాధితురాలు విచారం వ్యక్తం చేస్తోంది. బుధవారం పాఠశాలలో విధులు నిర్వర్తించేందుకు వెళ్లగా.. ఇతరులతో ఆ పని చేస్తున్నారని అధికారులు తనకు తగిన న్యాయం చేయాలని బాధితులు వాపోయింది. ఆయా భర్త రామసుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ తమకు జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరాడు.

దసరా ఉత్సవాల్లో అందరూ పాల్గొనండి

మైదుకూరు : మైదుకూరులో ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకట ప్రసాద్ కోరారు. బుధవారం ఆర్యవైశ్య సభ కార్యవర్గం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను అమ్మవారిశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకట ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్‌లో దసరా ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారికి గత ఏడాదికంటే మరింత శోభాయమానంగా, భక్తిభావం ఉట్టిపడేలా అలంకరణలు చేయిస్తున్నట్లు వివరించారు. పండుగ రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అక్టోబర్ 3న ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలు 13వ తేదీ వసంతోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆర్యవైశ్యసభ ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారావు, ప్రధాన కార్యదర్శి దరిశా సునీల్ కుమార్, కోశాధికారి కటకం వెంకటసుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు కోటా సంజీవ్‌కుమార్, గుండా ఆనంద్ పాల్గొన్నారు.



దసరా ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సభ కార్యవర్గం

వరద బాధితులకు విద్యార్థుల చేయూత

బ్రహ్మంగారిమఠం: విజయవాడ వరద బాధితులకు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు తమ వంతు సాయాన్ని అందించి సేవాగుణాన్ని చాటుకున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీ రూ. 10,120 జమ చేశారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ పద్మనాభమూర్తికి విద్యార్థులు తెలిజేశారు. విద్యార్థులు అందించిన సాయాన్ని బుధవారం కడపకు వెళ్లి జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్‌కు డీడీని విద్యార్థులతో కలసి అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని వరద బాధితులకు సాయం చేసిన విద్యార్థుల సేవా భావానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు బసిరెడ్డి, శ్రీనివాసులు, రామ్మోహన్, గురురత్నం, అశోక్ పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్ డీడీ అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

వీగిన అవిశ్వాసం

ఫలించని టీడీపీ యత్నాలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అక్రమ్ గౌస్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. టీడీపీ నేతల ప్రయత్నాలు ఫలించలేదు. వాస్తవానికి టౌన్ బ్యాంకు పాలక వర్గసభ్యుల్లో వైఎస్సార్‌సీపీ వర్గీయులు మెజారిటీ సంఖ్యలో ఉన్నారు. అయితే టీడీపీ నేతలు తమ ప్రభుత్వం అధికారంలో ఉందని వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి తమ అనుచరులను నియమించుకోవాలని ఏర్పాట్లు చేశారు. బుధవారం జరిగిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి అవసరమైన సభ్యులు హాజరు కాలేదు. మెజారిటీ సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయాలని టీడీపీ నేతలు కోరారు. ఇందుకు సంబంధిత అధికారి అంగీకరించలేదు. నోటీసులు ఇచ్చి సమావేశం ఏర్పాటు చేసిన తర్వాత వాయిదా వేయడం కుదరదని అన్నారు. దీంతో నిరాశతో టీడీపీ నేతలు వెనుదిరిగారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు : యువతీ యువకులు నైపుణ్యాలను పెంపొందించుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కడప నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎక్స్‌పీరియన్సియల్ లెర్నింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ, జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆశయాల సాధనలో భాగంగా మై భారత్ పోర్టల్‌లో యువతీ యువకులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ, డాక్టర్ ఆనంద్ బాబు

'చెకుముకి'తో శాస్త్రీయ దృక్పథం పెంపు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడతాయని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన చెకుముకి పాఠశాల స్థాయి సంబరాలు విజయవంతమయ్యాయని తవ్వా సురేష్, ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో చెకుముకి పాఠశాల స్థాయి ప్రశ్నపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి, స్వతంత్ర ఆలోచన, సృజనాత్మకతను పెంచడానికి తోడ్పడే విధంగా ఈ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు అక్టోబర్ ఒకటిన పట్టణంలో తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో జరిగే మండల స్థాయి చెకుముకి పరీక్షలో పాల్గొంటారని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు చెన్నప్ప, వినోద్ కుమార్, నరసింహులు, తిరుమలదేవి, స్వర్ణలత పాల్గొన్నారు.



చెకుముకి ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ తదితరులు

విజ్ఞానాన్ని పెంపొందించేందుకే చెకుముకి పరీక్షలు

కలసపాడు : విద్యార్థుల్లో మనోవికాసాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు చెకుముకి పరీక్షలు ఎంతో అవసరమని సెయింట్ ఆంటోనీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తాప్రభావతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆంటోనీస్ పాఠశాలలో వంద మంది విద్యార్థులకు చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మనోవిజ్ఞానాన్ని వికసింపజేసేందుకు ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక మండలసెక్రటరీ గురయ్య, సైన్స్ ఉపాధ్యాయులు రమణాచారి, శ్రీనివాసులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.